సాక్షి
యాదాద్రి భువనగిరి

గురువారం । 30 । మార్చి । 2023



చిరుత కళేబరంతో కలకలం

నల్లగొండ సమీపంలోని డంపింగ్ యార్డులో చిరుత కళేబరం కనిపించడంతో సమీప గ్రామాల ప్రజలు ఉలిక్కిపడ్డారు. - 10లో



నారసింహుడికి నిత్యపూజలు

యాదాద్రి క్షేత్రంలో నిత్యపూజలు కొనసాగాయి. పూజల ద్వారా రూ.12,46,777 ఆదాయం వచ్చింది. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం
38°/23°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.



న్యూస్‌రీల్

అండర్‌పాస్‌ను త్వరగా పూర్తిచేయాలి



ఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ప్రభుత్వ విప్

యాదగిరిగుట్ట రూరల్: హైదరాబాద్– వరంగల్ జాతీయ ప్రధాన రహదారి– 163పై యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామం వద్ద, వంగపల్లి– మోటకొండూర్ మండలానికి వెళ్లే ప్రధాన రహదారిలో అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత కోరారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లో ఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజును కలిసి విన్నవించారు. అండర్ పాస్‌కు సంబంధించిన టెండర్‌లను త్వరగా పిలవాలని కోరారు. అంతకు ముందు ఆయనకు యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి లడ్డూప్రసాదం అందజేశారు.

బస్టాండ్‌ను పాతస్థానంలో కొనసాగించాలి



పువ్వాడ అజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐక్య కార్యాచరణ కమిటీ

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట పట్టణ బస్టాండ్‌ను ఇంతకుముందు ఉన్న స్థానంలోనే కొనసాగించాలని కోరుతూ యాదగిరిగుట్ట పట్టణ అన్ని రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణం నుంచి బస్టాండ్ తొలగిస్తే, వేలాది మంది ఉపాధిని కోల్పోతారని తెలిపారు. పట్టణ ప్రజలను దృష్టిలో పెట్టుకుని బస్టాండ్‌ను పాతస్థానంలోనే కొనసాగించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు బబ్బూరి శ్రీధర్, సింగిల్ విండో వైస్ చైర్మన్ కాటబత్తిని ఆంజనేయులు, సీపీఎం మండల కార్యదర్శి బబ్బూరి పోశెట్టి, శ్యామ్‌సుందర్, పేరబోయిన మహేందర్, బట్టు సతీష్, బండి అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

వాగ్మీ అగరుబత్తీలకు ప్రత్యేక గుర్తింపు

ఆలేరురూరల్: అంతర్జాతీయ జీరో వేస్ట్ డే సందర్భంగా బుధవారం ఢిల్లీలో అర్బన్ డెవలప్‌మెంట్ మినిస్ట్రీ, పర్యావరణ మాతృత్వశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛదూత్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రం నుంచి పది మందిని స్వచ్ఛదూతలుగా నియమించగా.. అందులో ఆలేరు వాగ్మీ ప్రాజెక్టుకు ప్రాతినిధ్యం లభించిందని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. వాగ్మీ ప్రాజెక్టులో భాగంగా ఆలేరు మున్సిపాలిటీ నుంచి అన్నపూర్ణ ఆధ్వర్యంలో వాగ్మీ అగరుబత్తీల ఉత్పత్తులను తయారు చేసే విధానాన్ని ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వాగ్మీ ప్రాజెక్టుకు మంచి గుర్తింపు వస్తుందని తహసీల్దార్ తెలిపారు.

రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ ఎన్నిక

భువనగిరిటౌన్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు డీఆర్‌డీఓ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన చైర్మన్‌గా గుర్రం లక్ష్మినర్సింహారెడ్డి, వైస్ చైర్మన్‌గా దిండి బాలాజీ, కోశాధికారిగా దేవనక అంజయ్య, స్టేట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా రావుల మహేందర్‌రెడ్డి, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, కొడారి వెంకటేశం, మంచికంటి రమేష్, మహ్మద్ ఖలీల్, సోమ నర్సింహ, బొక్క రాంబాయి, షేక్ అమిత్‌భాషా, జంపాల అంజయ్య, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, భిక్షమయ్య, శంకర్‌రెడ్డిలను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

డబుల్ ఎంపికలో ఉద్రిక్తత



నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష కౌన్సిలర్లు, నాయకులు



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల దరఖాస్తుదారులు

- వివాదాస్పదంగా మారిన జిల్లా కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక
- అధికారపార్టీకి అనుకూలంగా ఎంపిక చేశారని ప్రతిపక్షాల ఆందోళన
- కలెక్టరేట్‌కు భారీగా తరలివచ్చిన దరఖాస్తుదారులు
- పోలీసుల బందోబస్తు నడుమ లక్కీడ్రా పూర్తి చేసిన అధికారులు

సాక్షి, యాదాద్రి: భువనగిరి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల లక్కీడ్రా తీవ్ర ఉద్రిక్తత నడుమ కొనసాగింది. సింగన్నగూడెం వద్ద నిర్మించిన 444 ఇళ్లకు రెవెన్యూ అధికారులు 3,415 దరఖాస్తులను స్వీకరించి 1,950 మందిని అర్హులుగా గుర్తించారు. వీరిలో 444 మందిని ఎంపిక చేయడానికి అధికారులు కలెక్టరేట్‌లో డ్రా చేపట్టారు. అయితే అర్హుల జాబితాను వార్డుల్లో ప్రకటించకుండా తొందరగా ఎంపిక చేయడాన్ని నిరసిస్తూ ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. వీరి అరెస్టుల అనంతరం అధికారులు, బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు పోలీసుల బందోబస్తు నడుమ లబ్ధిదారుల లక్కీడ్రా ప్రారంభించి రాత్రి 8 గంటలకు పూర్తి చేశారు.

ప్రతిపక్ష నాయకుల ధర్నా

జాబితాను వార్డుల్లో ప్రదర్శించకుండా ఏకపక్షంగా ఆగమేఘాల మీద డ్రా తీయడం ఏంటని ప్రతిపక్షాల నాయకులు, కౌన్సిలర్లు డ్రా తీస్తున్న అధికారుల ఎదుట ఆందోళన చేపట్టారు. పోడియం ఎదుట మెరుపు ధర్నాకు దిగారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాను వార్డుల్లో ప్రకటించకుండా తొందరగా ఎంపిక చేయడంపై ప్రతిపక్షాల కౌన్సిలర్లు అనుమానాలు వ్యక్తం చేశారు. అర్హుల జాబితాలో అనర్హులు ఉన్నారని, వారిని గుర్తించే వీలులేకుండా అధికార పార్టీకి అనుకూలంగా అధికారులు వ్యవహరించారని కాంగ్రెస్, బీజేపీ ఫ్లోర్ లీడర్లు పోత్నక్ ప్రమోద్‌కుమార్, మాయ దశరథలు ఆరోపించారు. అఖిలపక్షం నాయకులు, ప్రతిపక్ష కౌన్సిలర్లు కలెక్టరేట్‌లో ఆందోళనకు దిగడంతో పోలీసులు వారిని బయటకు పంపించారు. దీంతో కలెక్టరేట్ ఎదుట భువనగిరి– వరంగల్ రహదారిపై దరఖాస్తుదారులతో కలిసి ఆందోళనకు దిగారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను బహిరంగంగా వార్డుల వారీగా డ్రా పద్ధతిలో కేటాయించాలని దరఖాస్తు దారులు డిమాండ్ చేశారు. సుమారు నాలుగు గంటల పాటు ఆందోళన చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.



కౌన్సిలర్లను అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న పోలీసులను అడ్డుకుంటున్న మహిళలు

కలెక్టరేట్‌కు భారీగా తరలివచ్చిన దరఖాస్తుదారులు

బుధవారం ఉదయం డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తామని మంగళవారం రాత్రి 10 గంటల తర్వాత అధికారులు కౌన్సిలర్లకు సమాచారం ఇచ్చారు. ఈ విషయం సోషల్‌మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. విషయం తెలుసుకున్న దరఖాస్తుదారులంతా కలెక్టరేట్‌కు తరలివచ్చారు. దీంతో కలెక్టరేట్‌లోకి కేవలం మున్సిపల్ కౌన్సిలర్లు, అఖిలపక్షాల నాయకులు, అధికారులను మాత్రమే అనుమతించారు. మిగతావారు కార్యాలయంలోనికి రావొద్దని చెప్పడంతో పోలీసులు దరఖాస్తుదారులను అడ్డుకున్నారు.

ఇబ్బంది పడిన సిబ్బంది, ప్రజలు

పోలీసుల అత్యుత్సాహంతో కలెక్టరేట్ వచ్చిన వారు ఇబ్బంది పడ్డారు. వివిధ పనుల కోసం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారిని లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఆలేరు మండలంలోని ఓ వ్యక్తి రుణం కోసం దరఖాస్తు చేసుకోవడానికి వస్తే లోనికి అనుమతించలేదు. కార్యాలయానికి వ్యక్తిగత పనుల కోసం వచ్చిన వారినీ సైతం లోనికి వెళ్లనివ్వలేదు. దీంతో ప్రధాన గేటు ఎప్పుడు తీస్తారోనని మండుటెండలోనే నిలబడ్డారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న సిబ్బంది పరిస్థితి కూడా అలానే మారింది.

444 మందికి ఇళ్ల కేటాయింపు : ఆర్డీఓ

సింగన్నగూడెం వద్ద గల డబుల్ బెడ్ రూం ఇళ్లను డ్రా పద్ధతిలో లబ్ధిదారులకు కేటాయించినట్లు ఆర్డీఓ ఎంవీ భూపాల్‌రెడ్డి తెలిపారు. వచ్చిన 4,315 దరఖాస్తులను మూడు విడతలుగా విచారించి 1,950 మంది అర్హులను ఎంపిక చేశామని పేర్కొన్నారు. వీరిలో డ్రా పద్ధతిన 444 మందిని ఎంపిక చేసి ఇళ్లు కేటాయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, కమిషనర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ పమేలా సత్పతి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సాక్షి,యాదాద్రి: ఏప్రిల్ 3 నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి బుధవారం కలెక్టర్, సంబంధిత శాఖ అధికారులతో పదో తరగతి పరీక్షల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 51 పరీక్షా కేంద్రాల్లో 9,061 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా, పరీక్ష తరువాత ఇంటికి చేరుకునే విధంగా ఆర్టీసీ బస్సులు నడపిస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖకు సూచించినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు ముందుగానే పరీక్షా కేంద్రాలను పరిశీలించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించామన్నారు. సమావేశంలో డీసీపీ రాజేష్ చంద్ర, అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ, డీఈఓ నారాయణరెడ్డి, విద్యుత్ శాఖ ఎస్‌ఈ శ్రీనాథ్ ఉన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన పెంచుకోవాలి

భువనగిరిటౌన్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. భువనగిరి మున్సిపాలిటీ సమావేశ మందిరంలో బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ పక్షంపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోషణ పక్షోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రం, ప్రాజెక్టు, జిల్లా స్థాయిల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కళాశాల, పాఠశాల స్థాయిల్లో వ్యాసరచన పోటీలు, సమభావన సంఘాలు, కిశోర బాలికలకు అనీమియా పరీక్షలు, చిరు ధాన్యాల ప్రాముఖ్యత, ఆరోగ్యంపై డాక్టర్స్‌టాక్, అనీమియా క్యాంపులు, కిచెన్ గార్డెన్ల ప్రాముఖ్యతపై సెమినార్లు, యోగా క్లాసులు, పోషణ పంచాయత్‌లు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వ్యాధుల రక్షణకు టీకాలు వేయించుకోవాలని, ప్రతి గర్భిణీ అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే శుక్రవారం సభల్లో పాల్గొనాలన్నారు. శుక్రవారం సభల ద్వారా మహిళలను ఐరన్ తీసుకునేలా ప్రోత్సహిస్తూ 70 శాతం ఉన్న అనీమియాను 40 శాతానికి తగ్గించామని తెలిపారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలపై రూపొందించిన పోషణ పక్షం అవగాహన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీపీ నరాల నిర్మల వెంకటస్వామి, జెడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, జిల్లా సంక్షేమ అధికారి, ప్రాజెక్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆశీర్వదించండి

- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నిరసనలో పాల్గొన్న ఎంపీ కోమటిరెడ్డి

సాక్షి, యాదాద్రి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. బుధవారం కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో భువనగిరి వినాయక చౌరస్తాలో చేపట్టిన నిరసనకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చుకోవాలన్నారు. థాక్రే నేతృత్వంలో అందరం కలిసికట్టుగా ముందుకు వెళ్తున్నామని, టికెట్ల విషయంలో సర్వే చేయించి గెలిచే అభ్యర్థులకు ఇస్తారన్నారు. రాహుల్ గాంధీ అంశంతో పాటు ఇతర ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. 9 ఏళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ వేయకుండా రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేయడం చరిత్రలో ఇదే తొలిసారి అన్నారు. ఈ ప్రభుత్వానికి పరీక్ష పేపరులీక్ దిద్దడం, ఖాళీ పోస్టులు భర్తీ చేయడం రాదని ఎద్దేవా చేశారు. ఉచిత విద్యుత్, రుణమాఫీ అని గొప్పలు చెప్పుకుంటుందని, కానీ కరెంట్ కేవలం 6 గంటలే వస్తుందన్నారు. హైదరాబాద్ నుంచి ఆలేరు వరకు ఎంఎంటీఎస్ రైలు అదనపు లైన్ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి కూడా వాటా ఉంటుందని, కానీ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆయన వెంట కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



పరీక్షలు ముగిసిన ఆనందంలో విద్యార్థినులు

- ఇంటి బాట పట్టిన విద్యార్థులు

భువనగిరి: ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం ముగిసాయి. కాగా చివరి రోజు జరిగిన రసాయన శాస్త్రం, వాణిజ్య శాస్త్రం పేపర్– 2 పరీక్షలకు మొత్తం 5,090 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 4914 మంది విద్యార్థులు హాజరయ్యారని, 176 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ రమణి తెలిపారు. కాగా.. ఇంటర్ పరీక్షలు ముగియడంతో వసతి గృహాలు, ప్రైవేట్ హాస్టల్స్‌లో ఉన్న విద్యార్థులు స్వగ్రామాలకు వెళ్లారు. దీంతో సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్‌లో విద్యార్థుల సందడి నెలకొంది.



చౌటుప్పల్ గురుకులం నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

పెరిగిన టోల్‌ప్లాజా ఫీజు

- ఏప్రిల్ 1నుంచి అమలులోకి
- ఉత్తర్వులు జారీ చేసిన నేషనల్ హైవే అథారిటీ

బీబీనగర్: జాతీయ రహదారిపై గల టోల్‌ప్లాజాల వద్ద వాహనాల ఫీజులను పెంచుతూ నేషనల్ హైవే అథారిటీ సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. బీబీనగర్ మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త ఫీజులు అమల్లోకి రానున్నాయి. 163హైదరాబాద్– వరంగల్ హైవే మార్గంలో గల గూడూరు టోల్‌ప్లాజాకు హైదరాబాద్ వైపు నుంచి అన్నోజిగూడ, యాదాద్రి వైపు రాయగిరి వరకు గల రహదారి పరిమితి కిలోమీటర్ల లోపు ఫీజులను వసూలు చేస్తున్నారు. అయితే 2012లో టోల్‌ప్లాజా ఏర్పాటు అయినప్పటి నుంచి ఇప్పటివరకు నాలుగు సార్లు ఫీజులను పెంచుతూ వచ్చారు. తాజాగా పెంచిన వాహన ఫీజులతో టోల్ ప్లాజా సంస్థకు ఆదాయం అదనంగా రానుండగా వాహనదారులకు గుదిబండగా మారనుంది. ఇప్పటికే గూడూరు టోల్‌ప్లాజాకు యాదాద్రి పుణ్యక్షేత్రంతో వాహనాల తాకిడి పెరగడంతో రోజుకు రూ.3వేలకు పైగా ఆదాయం వస్తుండగా, వీకెండ్‌లలో రూ.50వేల పైన ఆదాయం సమకూరుతుంది. ప్రసుత్తం ఉన్న వాహన ఫీజులు ఈనెల 31 రాత్రి 12గంటల వరకు కొనసాగగా ఆ తరువాత కొత్త ఫీజులు వసూలు చేయనున్నారు. గూడూరు టోల్ గుండా నిత్యం 25వేలకు పైగా వాహనాల రాకపోకలు సాగుతుండగా, వీకెండ్‌లో 40వేలకు పైగా వాహనాలు వెళ్తుంటాయి.



గూడూరు టోల్‌ప్లాజా

పెంచిన రుసుము వివరాలు..

- కారు, జీప్, వ్యాన్, లైట్ మోటారు వాహనాలకు సింగిల్ జర్నీ ఫీజు: 115, ఫాస్టాగ్ ఉంటే ఒక రోజు తిరుగు ప్రయాణానికి రూ.170కి పెంచారు.
- లైట్ కమర్షియల్, గూడ్స్, మినీ బస్సులకు సింగిల్ జర్నీ ఫీజు రూ.175, ఫాస్టాగ్ ఉంటే ఒక రోజు తిరుగు ప్రయాణానికి రూ.265కు పెంచారు.
- బస్సు లేదా ట్రక్కుకు సింగిల్ జర్నీకి రూ.355, ఫాస్టాగ్ ఉంటే ఒక రోజు తిరుగు ప్రయాణానికి రూ.535 చెల్లించాల్సి ఉంటుంది.
- హెవీ కన్‌స్ట్రక్షన్ మిషనరీ, ఎర్త్ మూవింగ్, మల్టీ యాక్సిల్ వాహనాలకు సింగిల్ జర్నీకి రూ.540, ఫాస్టాగ్ ఉంటే ఒక రోజు తిరుగు ప్రయాణానికి రూ.805 చెల్లించాల్సి ఉంటుంది. ఓవర్ సైజ్ వాహనాలకు (ఏడు లేక అంతకు మించిన యాక్సిల్స్ కలిగి ఉన్నవి) సింగిల్ జర్నీ రూ.700లకు పెంచారు. ఇక నెల పాస్‌లకు సంబంధించి లైట్ మోటారు వాహనాలకు నెల 50ట్రిప్పులకు గాను రూ.3,805, లైట్ కమర్షియల్ వాహనాలకు రూ.5,835, బస్సు, ట్రక్కులకు రూ.11,835లకు పెంచారు.

ఈ నెల 31 అర్ధరాత్రి వరకే ప్రస్తుతం ఉన్న ఫీజు



బీబీనగర్ మండలంలోని టోల్‌ప్లాజా గుండా వెళ్లే వాహనాలకు ఏప్రిల్ 1 నుంచి కొత్తగా పెంచిన వాహన ఫీజులు అమల్లోకి వస్తాయి. ఈనెల 31 అర్ధరాత్రి వరకు ప్రసుత్తం ఉన్న వాహన ఫీజులు వసూలు చేయడం జరుగుతుంది. ఫాస్టాగ్ ఉన్న వాహనాలకు ఫీజుల విషయంలో రాయితీ ఉంది. వాహనదారులు తప్పనిసరిగా ఫాస్టాగ్ చేయించుకోవాలి.

– సుధీర్, టోల్‌ప్లాజా మేనేజర్

చౌటుప్పల్ మార్కెట్‌లో 'సంస్థాన్' విలీనం

- చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో కలవనున్న సంస్థాన్‌నారాయణపురం
- రైతుల కోరిక మేరకు ఎమ్మెల్యే నిర్ణయం
- ఇప్పటికే పూర్తయిన మార్కెట్ పాలకవర్గం గడువు
- సంస్థాన్‌నారాయణపురం విలీనమయ్యాకే కొత్త కమిటీ ఏర్పాటు జరిగే అవకాశం



చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

చౌటుప్పల్: చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోకి మరో కొత్త మండలం రానుంది. ఇప్పటికే ఈ మార్కెట్ పరిధిలో చౌటుప్పల్ మండలంతోపాటు, చిట్యాల, పోచంపల్లి మండలంలోని పలు గ్రామాలు ఉన్నాయి. వీటితోపాటు నూతనంగా సంస్థాన్‌నారాయణపురం మండలం వచ్చి చేరనుంది. ఈ ప్రక్రియ సైతం ప్రారంభమైంది. త్వరలోనే విలీనం పూర్తికానున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు మూడు మండలాల పరిధిలో ఉన్న ఈ మార్కెట్ నాలుగు మండలాల పరిధికి విస్తరించనుంది.

రెండు మండలాల మధ్య 35కిలోమీటర్ల దూరం..

కొన్ని దశాబ్దాల నుంచి సంస్థాన్‌నారాయణపురం మండలం నల్లగొండ జిల్లా చండూరు వ్యవసాయ మార్కెట్ పరిధిలోనే ఉంది. చండూరుకు ఉప మార్కెట్‌గానూ కొనసాగుతోంది. అయినా సబ్ మార్కెట్ యార్డుగాని, గోదాములనుగాని నిర్మించలేదు. దీంతోపాటు రెండు మండలాల నడుమ 35కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ దూరాన్ని, రైతుల అభిష్టాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి సౌకర్యవంతంగా ఉండాలని భావించిన ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి దీని పరిధిని మార్చాలని మంత్రి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించి చౌటుప్పల్, చండూరు మార్కెట్‌ల నుంచి ఎన్‌ఓసీ రావాల్సి ఉంది. చౌటుప్పల్– నారాయణపురం మండలాల నడుమ దూరం కేవలం 12కిలోమీటర్లు మాత్రమే ఉండడం, ఒకే జిల్లా, ఒకే రెవెన్యూ డివిజన్ కావడంతో రైతాంగానికి అన్ని విధాలుగా ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

విలీనం పూర్తయ్యాకే..

రాష్ట్ర విభజన తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటి వరకు రెండు పాలకవర్గాలు పనిచేశాయి. మొదట జనరల్ మహిళకు రిజర్వ్ కావడంతో 2018లో చౌటుప్పల్‌కు చెందిన బొడ్డు రేవతి, మండలంలోని జైకేసారం గ్రామానికి చెందిన చిరందాసు ధనుంజయ్య వైస్ చైర్మన్‌గా వ్యవహరించారు. రెండోసారి జనరల్‌గా రిజర్వ్ కావడంతో చౌటుప్పల్‌కే చెందిన బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి చైర్మన్‌గా, నేలపట్లకు చెందిన కప్పల శ్రీనివాస్ వైస్ చైర్మన్‌గా 2021లో నియమితులై 2022డిసెంబరు వరకు పనిచేశారు. తాజాగా చైర్మన్ పదవి ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ అయింది. ప్రస్తుతం సంస్థాన్‌నారాయణపురం మండలం చౌటుప్పల్‌లో విలీనం ప్రక్రియ పూర్తయ్యాకే నూతన పాలకవర్గాన్ని నియమిస్తారో లేక అంతకు ముందే ప్రకటిస్తారో వేచిచూడాలి.

ప్రస్తుతం చౌటుప్పల్ మార్కెట్ పరిధిలోని గ్రామాలు

- చౌటుప్పల్ (చౌటుప్పల్ మండలంలోని పూర్తిగా 31 గ్రామాలు)
- పోచంపల్లి (దోతిగూడెం, కనుముక్కల, జిబ్లక్‌పల్లి, అంతమ్మగూడెం, భీమనపల్లి, మెహర్‌నగర్, దంతూరు, వంకమామిడి, ధర్మారెడ్డిపల్లి, సల్లోనిగూడెం)
- చిట్యాల మండలంలో (గుండ్రాంపల్లి, వెలిమినేడు, పెద్దకాపర్తి, సుంకెనపల్లి, ఏపూరు, పిట్టంపల్లి, చిన్నకాపర్తి, ఆరెగూడెం, మొర్సుగూడెం)

ఉన్నతాధికారులకు నివేదిక

సంస్థాన్‌నారాయణపురం మండలాన్ని చౌటుప్పల్ మార్కెట్ పరిధిలో విలీనం చేయాలన్న ప్రతిపాదనకు ఏ మేరకు అవకాశాలున్నాయన్న విషయంలో సంబంధిత శాఖ సైతం దృష్టి సారించింది. గతంలో ఉన్న మార్కెట్‌కు ఎంత దూరం ఉంటుంది. నూతనంగా ప్రతిపాదించిన మండలానికి నడుమ ఎంత దూరం ఉంటుంది. రైతులకు ఎలాంటి అదనపు ప్రయోజనాలు చేకూరుతాయన్న అంశంపై ఆరాతీశారు. స్థానిక మార్కెట్ అధికారులు ఇప్పటికే అన్ని అంశాలతో కూడిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించారు. ఆ ప్రకారంగా ప్రక్రియ వేగవంతంగానే జరుగుతున్నట్లు సమాచారం.

రైతులకు చాలా ప్రయోజనం



సంస్థాన్‌నారాయణపురం మండలాన్ని చండూరు వ్యవసాయ మార్కెట్ పరిధి నుంచి చౌటుప్పల్ మార్కెట్‌కు మార్చే ప్రక్రియ తెరపైకి రావడం వాస్తవమే. ఇదే విషయాన్ని మంత్రి నిరంజన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాను. రెండు మార్కెట్‌ల నుంచి ఎన్‌ఓసీ ఇవ్వాల్సి ఉంది. ఈ ప్రక్రియ ద్వారా ఏ మండలానికి ఇబ్బందులు ఉండవు. రైతులకు అన్ని విధాలుగా ప్రయోజనం చేకూరుతుంది.

– కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినులకు గాయాలు

కనగల్: రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థినులకు గాయాలయ్యాయి. ఈ ఘటన కనగల్ మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. పాఠశాల ప్రిన్సిపాల్ మమత తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ విద్యార్థినులు నల్లగొండ పట్టణంలోని వివిధ ఎగ్జామ్ సెంటర్లకు ఆటోలో వెళ్తుండగా కుక్క అడ్డు రావడంతో ఆటో అదుపు తప్పి పక్కనే ఉన్న కల్వర్టు, కరెంట్ పోల్‌కు ఢీకొట్టింది. దీంతో అందులోని దీపిక, శ్యామలకు తీవ్ర, చిత్రం అనిత, అంజలికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వీరికి కనగల్ క్రాస్ రోడ్డు వద్ద ప్రథమ చికిత్స చేయించి పరీక్ష కేంద్రాలకు తీసుకువెళ్లి రాయించినట్లు తెలిపారు. అనంతరం తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు.

కోతుల దాడిలో విద్యార్థికి గాయాలు

శాలిగౌరారం: కోతుల దాడిలో ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని తిరుమలరాయునిగూడెం గ్రామానికి చెందిన టేకుల వేణు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం పాఠశాల వరండాలో తోటి విద్యార్థులతో కూర్చొని చదువుకుంటున్నాడు. తరగతి గదివద్దకు వచ్చిన కోతులు ఒక్కసారిగా విద్యార్థి వేణుపై దాడి చేశాయి. దీంతో ఆ విద్యార్థి కేకలు వేయడంతో పక్కన ఉన్న విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు వెంటనే కోతులను తరిమికొట్టారు. గాయపడిన వేణును ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. పాఠశాల ఆవరణలో కోతుల బెడద అధికమైందని ఉపాధ్యాయులు చెప్పారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

నల్లగొండ క్రైం : బాలికపై ఓ వృద్ధుడు లైంగిక దాడికి యత్నించాడు. నల్లగొండ మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అన్నెపర్తి గ్రామానికి చెందిన మర్రి ఊషయ్య ఓ గ్రామానికి చెందిన బాలికకు బుధవారం తినుబండారాలు కొనిచ్చి లైంగికదాడికి యత్నించాడు. స్థానికులు గమనించడంతో బాలికను వదిలి పారిపోయాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కంచర్ల భాస్కర్ రెడ్డి తెలిపారు.

చిరుత కళేబరంతో కలకలం

- ఉలిక్కిపడిన సమీప గ్రామాల ప్రజలు
- పది రోజుల క్రితం మృతిచెంది ఉంటుందని అధికారుల వెల్లడి
- రాచకొండ ప్రాంతం నుంచి వచ్చి ఉంటుందని అంచనా
- 15రోజుల క్రితమే రైతులు గుర్తించినా తేలిగ్గా తీసుకున్న అటవీ అధికారులు



చిరుత కళేబరాన్ని బయటకు తీసి పరిశీలిస్తున్న అటవీ, పశువైద్యాధికారులు, స్థానికులు



చిరుత కళేబరానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న పశువైద్యాధికారి

నల్లగొండ క్రైం : నల్లగొండ పట్టణ సమీపంలోని చందనపల్లి చెత్త డంపింగ్ యార్డులో చిరుత కళేబరం బుధవారం వెలుగులోకి రావడంతో సమీప గ్రామాల ప్రజల ఉలిక్కిపడ్డారు. సుమారు పది రోజుల క్రితం చిరుత మృతిచెంది ఉంటుందని అటవీ శాఖ అధికారులు, పశువైద్యులు అంచనా వేస్తున్నారు.

ఇలా వెలుగులోకి...

శేషమ్మగూడెం గ్రామానికి చెందిన కిరణ్ తన పందులను చూసుకునేందుకు చెత్తడంపింగ్ యార్డు వద్దకు వెళ్లాడు. అక్కడే రెండు పందులు చనిపోయి ఉండటంతో రోజు పందుల గుంపు సేద తీరే ప్రాంతానికి వెళ్లి చూడగా చెట్ల పొదల్లో చిరుత నిద్రలో ఉన్నట్లు కనిపించింది. దాన్ని పక్కనే మరో పంది చనిపోయి ఉండటాన్ని చూసి కంగుతిన్నాడు. భయపడి దూరంగా వెళ్లి బంధువైన అటవీ శాఖ ఉద్యోగికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. సమీపంలో ఉన్న వారికి కూడా విషయం చెప్పడంతో పులిని పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించుకున్నారు. ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది.

చిరుత కళేబరానికి పోస్టుమార్టం

సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించి చనిపోయిన మగ చిరుత 5 నుంచి 6 సంవత్సరాల వయస్సు ఉంటుందని తెలిపారు. పశువైద్యాధికారి సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో చిరుత కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. అవయవాలు, గోర్లను సేకరించి హైదరాబాద్‌లోని పశు వైద్య బయోలాజికల్ రీసెర్చ్ ల్యాబ్‌కు పంపించారు. రైతులు పెట్టిన మందును తిని చనిపోయిన కళేబరాన్ని తినడం లేదా పొలాల్లో గుళికలు కలిపిన నీళ్లు తాగడంతోనైనా మృతిచెంది ఉండొచ్చని భావిస్తున్నట్లు పశువైద్యాధికారి తెలిపారు. చిరుత పులి పడుకున్న కిందిభాగం పూర్తిగా కుళ్లిపోయి ఉన్నట్లు తెలిపారు. అనంతరం అక్కడే చిరుత కళేబరాన్ని కాల్చేశారు.

రాచకొండ నుంచి రాక?

రాచకొండ అటవీ ప్రాంతం నుంచి చిరుతపులి వచ్చినట్లు అటవీ శాఖ అధికారులు అంచనాకు వచ్చారు. 2018వ సంవత్సరంలో మర్రిగూడం ప్రాంతంలో చిరుత సంచరించినట్లు అధికారులు గుర్తించారు. మూసీ కాల్వగుండా చిరుత చందనపల్లి వైపు వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. రాచకొండ ప్రాంతంలో ఆరు చిరుతలు ఉన్నాయని, ఆ ప్రాంత పులులే బలహీనంగా ఉంటాయని జిల్లా అటవీ శాఖ అధికారి రాంబాబు తెలిపారు. అయితే, 15రోజుల క్రితమే చిరుతను గుర్తించి సమాచారం ఇచ్చినా అటవీ అధికారులు పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. కాగా, డంపింగ్ యార్డు పరిసరాల్లో పెద్దగా జనసంచారం ఉండదు. పులి సమీప చెట్లపొదల్లోనే గడుపుతూ పందులను ఆహారంగా తీసుకుందని, పొలాల వైపు రాకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని రైతులు అంటున్నారు.

భయంతో పరుగులు తీశాను



“ పందుల గుంపు కోసం డంపింగ్ యార్డు శివారు చెట్ల పొదల వైపు వెళ్లాను. అక్కడ ఓ పంది చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. దానిని లేపుతూ చెట్ల పొదల వైపు చూడగా చిరుతపులి పడుకుని ఉన్నట్లు కనిపించింది. భయంతో పరుగులు తీసి విషయం అందరికీ చెప్పా.

– కిరణ్, శేషమ్మగూడెం

భావి శాస్త్రవేత్తలకు బంగారు బాటలు

- ఇస్రో ఆధ్వర్యంలో యువ విజ్ఞాని కార్యక్రమం
- విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- 9వ తరగతి చదివేవారికి అవకాశం
- ఏప్రిల్ 3వ తేదీ వరకు గడువు



సూర్యాపేటటౌన్ : పాఠశాలల స్థాయి విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతికతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మంచి అవకాశం కల్పిస్తోంది. విద్యార్థులకు స్పేస్ టెక్నాలజీ, స్పేస్ సైన్స్, స్పేస్ అప్లికేషన్స్‌పై ప్రాథమిక విజ్ఞానాన్ని పెంచేందుకు యువ విజ్ఞాని కార్యక్రమం(యువికా) నిర్వహిస్తోంది. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది.

విద్యార్థులు ఎంపికైతే..

ఈ శిక్షణకు విద్యార్థులు ఎంపికైతే మే 15 నుంచి 26వరకు భారతదేశంలోని ఇస్రోకు సంబంధించిన ఏడు ప్రాంతాల్లో ఉన్న కేంద్రాల్లో శిక్షణ ఇస్తారు. రెసిడెన్షియల్ పద్ధతిలో జరిగే కార్యక్రమంలో ప్రయోగాత్మక ప్రదర్శన, ప్రముఖ శాస్త్రవేత్తల అనుభవాలను పంచుకోవడంతో పాటు చర్చా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు. ఎంపికైన విద్యార్థితో పాటు తల్లిదండ్రుల్లో ఒకరికి లేదా గైడ్ టీచర్‌కు ప్రయాణ ఖర్చులను చెల్లిస్తారు. శిక్షణ అనంతరం శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్‌కు తీసుకెళ్లి అందులోని విశేషాలను ప్రత్యక్షంగా చూపిస్తారు.

ఆన్‌లైన్ ద్వారా..

విద్యార్థులు మొదట వారి ఈ మెయిల్ ఐడీతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. 48గంటల్లో ఇస్రో ఏర్పాటు చేసే ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. క్విజ్ పూర్తయిన 60 నిమిషాల అనంతరం యువికా పోర్టల్‌లో ఆన్‌లైన్ దరఖాస్తుతో పూర్తి వివరాలు నమోదు చేసి ధ్రువీకరణ పత్రాలను జత చేయాలి. దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 20 నుంచి ప్రారంభం కాగా వచ్చే నెల 3వరకు అవకాశముంది. తాత్కాలిక ఎంపిక జాబితాలను వచ్చే నెల 10న ప్రకటించి అర్హత సాధించిన వారికి సమాచారమిస్తారు.

9వ తరగతి చదివే వారు అర్హులు..

ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. గ్రామీణ ప్రాంతాల వారికి మొదటి ప్రాధాన్యమిస్తారు. 8వ తరగతిలో పొందిన మార్కులు, గత మూడేళ్లలో వివిధ రకాల ప్రదర్శన పోటీల్లో (గుర్తింపు పొందిన క్రీడల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో) పాల్గొని మొదటి మూడు స్థానాల్లో నిలిచి ఉండాలి. గత మూడేళ్లుగా స్కౌట్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌లలో సభ్యుడిగా ఉండాలి. ఆన్‌లైన్ క్విజ్‌లో ప్రతిభ చూపిన వారికి ప్రాధాన్యమిస్తారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

“ భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలనే ఆసక్తి గల వారికి యువికా శిక్షణ మంచి అవకాశం. శాస్త్రీయ అవగాహన, అంతరిక్ష పరిశోధన రంగాలపై ఈ శిక్షణ దోహదపడుతుంది. జిల్లాలో 9వ తరగతి చదివే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలి.

– అశోక్, డీఈఓ

ఉద్యమ ఆకాంక్షలకు విరుద్ధంగా కుటుంబ పాలన



నిరసన దీక్షలో పాల్గొన్న ఏబీవీపీ నాయకులు

భువనగిరి : రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలకు విరుద్ధంగా రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతుందని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఛత్రపతి చౌహాన్ అన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజ్ ఉదంతాన్ని నిరసిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. .బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వేసిన నోటిఫికేషన్ విడుదల చేసిన పేపర్ లీకేజీ కారణంగా విద్యార్థిలకు అన్యాయం జరిగిందన్నారు. పేపర్ లీకేజీలో మంత్రుల హస్తం ఉందన్నారు. సీట్ దర్యాప్తు అనేది దొంగలను కాపాడేందుకు పనిచేస్తున్నట్లుగా ఉందన్నారు.టీఎస్‌పీఎస్సీ రద్దు చేసిన పరీక్షలను తిరిగి నిర్వహించాలని లేని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ విబాగ్ కన్వీనర్ సుర్వి మణికంఠ, జిల్లా కన్వీనర్ బోడ బుచ్చిబాబు, సామల సాయి, వడ్లకొండ వేణు, శ్రీ విద్య, ప్రసన్న సాయికుమార్, శివ, పల్లవి, బబ్లు, అఖిల్ సాయి రామ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ యాప్‌లతో మోసం

మోత్కూర్ : నకిలీ యాప్‌లతో కొందరు యువత డబ్బులు చెల్లించకున్నా చెలించినట్లు మోసాలకు పాల్పడుతున్న వైనం బుధవారం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని కొందరు ముఠాగా ఏర్పడి స్థానిక ఓ మద్యం దుకాణంలో రూ.14,000 విలువైన మద్యం కొనుగోలు చేశారు. సదరు దుకాణ నిర్వాహకుల క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుని నకిలీ యాప్‌తో డబ్బులు చెల్లించకుండానే చెల్లించినట్లు మెసేజ్ చూపించి ఉడాయించారు. నిర్వాహకులు గమనించి సదరు యువకుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

షాపింగ్ కాంప్లెక్స్‌లో చోరీ

కొండమల్లేపల్లి : గుర్తుతెలియని వ్యక్తులు షాపింగ్ కాంప్లెక్స్‌లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన కొండమల్లేపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొండమల్లేపల్లికి చెందిన శ్రీనివాస్, వెంకటేశ్‌లు తమ తల్లిదండ్రులు సంపాదించిన ఖాళీ స్థలంలో 9 ఏళ్ల క్రితం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. అక్కడ వ్యాపారం అనుకూలించకపోవడంతో నాలుగేళ్ల క్రితం ఓ ప్రజాప్రతినిధికి విక్రయించారు. తమకు సంబంధించిన బీరువాఅ కాంప్లెక్స్ సెల్లార్‌లోని ఓ చిన్న గదిలో ఉంచి వెళ్లిపోయారు. కాగా, ఇటీవల కొందరు వ్యక్తులు బీరువా పగులగొట్టి అందులోని ఆభరణాలను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న శ్రీనివాస్, వెంకటేశ్‌లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు దుండగులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. అయితే, అవి నకిలీ బంగారు ఆభరణాలు కావని రోల్డ్‌గోల్డ్ అని పేర్కొన్నారు.

దౌర్జన్యంగా ఇంటి స్థలం ఆక్రమిస్తున్నారని..

- మహిళ ఆత్మహత్యాయత్నం

మఠంపల్లి: దౌర్జన్యంగా ఇంటి స్థలం ఆక్రమిస్తున్నారని ఓ మహిళ మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన మఠంపల్లి మండలం యాతవాకిళ్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బుడిగె కాశయ్యకు తన ఇంటి వెంట గుంట స్థలం ఉంది. దానికి కాశయ్య చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నాడు. అయితే అతని ఇంటి పక్కన బుడిగె మమత (దివ్యాంగురాలు) 20ఏళ్లుగా నివాసం ఉంటుంది.ఈ క్రమంలో మమత మరుగుదొడ్డి నిర్మాణానికి కాశయ్య సంబంధించిన స్థలంలో తనకు స్థలం ఉందంటూ కలెక్టర్, ఉన్నతాధికారులను పలుమార్లు కలిసి విన్నవించింది. దీంతో గతంలో తాహసీల్దార్, ఎంపీడీఓలు పరిశీలించి మరుగుదొడ్డి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే తిరిగి మమత మూడురోజుల క్రితం కలెక్టర్‌ను ఆశ్రయించింది. దీంతో మఠంపల్లి తహసీల్దార్ సాయాగౌడ్ బుధవారం పోలీసుల సహకారంతో కాశయ్య ఇంటిగోడను కూల్చి వేశారు. ఈక్రమంలో కాశయ్య భార్య సుజాత తమ ఇంటిని ఆక్రమిస్తున్నారని ఆందోళనతో అధికారులతో వాగ్వాదానికి దిగింది. అనంతరం పురుగుల మందు తాగింది. గమనించిన పోలీసులు ఆమెను హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది.

పాడి రైతులు పశుగ్రాసం పంటలు సాగు చేయాలి

గరిడేపల్లి : పాడి రైతులు పశు గ్రాసం పంటలను సాగు చేసుకోవాలని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్ సూచించారు. తద్వారా పశుపోషణకు అయ్యే ఖర్చులు తగ్గి పాల ఉత్పత్తి పెరగుతుందని అన్నారు. బుధవారం మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో పశుగ్రాస పంటల సాగుపై రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. పశుగ్రాస పంటల సాగు ద్వారా పచ్చిమేతను పశువులకు దాణాగా ఇచ్చినప్పుడు సులభంగా తింటాయని తెలిపారు. అధిక పోషక విలువలు కలిగిన రుచికరంగా ఉండటం వలన సులభంగా జీర్ణం అవుతుందని పేర్కొన్నారు.. తోటల్లో, పొలాల చుట్టూ, కాల్వల కట్టపైనా పశు గ్రాస పంటలను సాగు చేస్తే ఎక్కువగా లభించే పశు గ్రాసాన్ని నిల్వ చేసుకొని మేతగా ఉపయోగించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు సుగంధి, నరేష్ ఉన్నారు.

నారసింహుడికి నిత్యపూజలు

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రి శ్రీలక్ష్మీనారసింహుడి క్షేత్రంలో బుధవారం నిత్యపూజలు కొనసాగాయి. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం చేపట్టి, స్వయంభూవులకు బిందె తీర్థం, ఆరాధన నిర్వహించారు. అనంతరం స్వామివారికి బాలభోగం, నిజాభిషేకం జరిపించారు. స్వామి అమ్మవార్లను పట్టు వస్త్రాలతో అలంకరించి, సహస్రనామార్చన, కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణ పర్వాలను శాస్త్రోక్తంగా జరిపించారు.

కేంద్రం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది

- శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలను అడ్డం పెట్టుకొని ప్రతిపక్షాలకు చెందిన నాయకులపై దాడులు చేయిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గవర్నర్ వ్యవస్థను వాడుకుంటూ రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. అసెంబ్లీలో ఆమోదం పొందిన బిల్లులను గవర్నర్ నెలలు గడుస్తున్నా ఆమోదించకపోవడంతో అభివృద్ధికి ఆటంకంతో పాటు యూనివర్సిటీల్లో ఉద్యోగాల భర్తీ చేయలేక పోతున్నట్లు చెప్పారు. ప్రతి పక్ష పార్టీల గొంతు నొక్కడమే పనిగా కేంద్ర సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. రాఫేల్, అదానీ కంపెనీల లక్షల కోట్ల షేర్ల స్కాంపై ఎందుకు విచారణ జరిపించడం లేదని ఆయన ప్రశ్నించారు. వంద కోట్ల దానికి భూతద్దంలో చూపిస్తున్న కేంద్రం కావాలనే కేసీఆర్ కుటుంబాన్ని అప్రతిష్ట పాలు చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. దేశంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడు మంత్రి కేటీఆర్‌పై బురదజల్లేందుకు కుట్రలు, కుతంత్రాలు జరుగుతున్నాయన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కొంతమంది స్వార్థం కోసం చేశారని, దానిని రేవంత్‌రెడ్డి, బండి సంజయ్‌లు కేటీఆర్‌కు అంటగట్టే ప్రయత్నం చేయడం సబబుకాదన్నారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన కుటుంబం గాంధీ కుటంబం అని, రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేసి బంగ్లాను ఖాళీ చేయించడం కక్షసాధింపేనని అన్నారు.

వరి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రామోజీతండాలో వరిపొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఆత్మకూర్–ఎస్(సూర్యాపేట) : వరి పంట గింజ పోసుకుని గట్టిపడే దశలో అగ్గితెగులు, కాండం కుళ్లు తెగులు, కాండం తొలుచు పురుగు ఆశిస్తుందని వాటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని శ్రీ అరబిందో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఆదర్శ్, కిరణ్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని రామోజీతండా మండల వ్యవసాయ అధికారులతో కలిసి వరి పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గింజ పాలుపోసుకునే దశలో చీడపీడలను నివారించకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. అగ్గి తెగులు నివారణకు పికోక్సీస్ట్రోబిన్, ట్రైసైక్లజోల్‌లు 2 మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి దంతాల దివ్య, ఏఈఓ శైలజ, రైతులు గుగులోత్ వెంకన్న, కోట్య, రామ్మూర్తి తదితరులు ఉన్నారు.

ఆరుతడి వరిసాగుపై అవగాహన

చివ్వెంల(సూర్యాపేట) : నీటి లభ్యత తక్కువగా ఉన్న రైతులు ఆరుతడి పద్ధతిలో వరిసాగు చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చునని డాక్టర్ రెడ్డిస్ ఫౌండేషన్ సూర్యాపేట, నల్లగొండ జిల్లాల ఏరియా మేనేజర్ రాచకొండ వీరస్వామి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎర్రసూర్యాతండాలో సాగుపై రైతులకు అవగహన కల్పించారు. అదే విధంగా వరి విత్తనాలు ఆరుతడిలో విత్తే యంత్రం గురించి వివరించారు. బురద లేకుండా పనిచేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో ఉద్యాన పంటలను కాపాడుకుందాం ఇలా..

- దిగుబడులపై ఎండ ప్రభావం చూపే అవకాశం
- మామిడికి పండు ఈగ ఆశించకుండా మందుల పిచికారీ
- అరటి ఆకుల చుట్టూ ఎండు ఆకులు చుట్టాలి
- ఉద్యానవన శాఖ అనుముల క్లస్టర్ అధికారి కొంపెల్లి మురళి సూచనలు



జామతోట



అరటి తోట

పాడి పంట

పెద్దవూర: జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం ఏడాదికేడాది పెరుగుతోంది. అందులో మామిడి, అరటి, నిమ్మ, బత్తాయి, జామ పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. వేసవిలో తగిన జాగ్రత్తలు చేపట్టకపోతే ఆ చెట్లు అధిక ఉష్ణోగ్రతలకు లోనై దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. ఆ ప్రభావం అరటి, మామిడి, బత్తాయి, నిమ్మ, జామ కాయలపై పడితే అవి దెబ్బతినే ప్రమాదం ఉంది. ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే వేసవిలో దిగుబడులు తగ్గకుండా పంటలను కాపాడుకోవచ్చునని ఉద్యానవన శాఖ అనుముల క్లస్టర్ స్థాయి అధికారి కొంపెల్లి మురళి సూచిస్తున్నారు. చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు ఆయన మాటల్లోనే..

మామిడి

మామిడి చెట్లు ప్రస్తుతం పిందె దశలో ఉన్నాయి. ఈ పిందె రాలకుండా నిలబెట్టుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లీటర్ నీటికి 10 గ్రాముల పొటాషియం నైట్రేటు కలిపి పిచికారీ చేసుకోవాలి.లేదా నాలుగు



మురళి, ఉద్యానవన శాఖ అధికారి

లీటర్ల నీటికి 1 మిల్లీ లీటరు ప్లానోఫిక్స్ కలిపి పిచికారీ చేయాలి. దోమ వ్యాపించే అవకాశం కూడా ఉండటంతో దీని నివారణకు లీటరు నీటికి 0.5 మిల్లీ లీటర్ల కాన్ఫిడార్ మందును కలిపి పిచికారీ చేసుకోవాలి. ఈ కాలంలో పండు ఈగ ఆశించే అవకాశం ఎక్కువ. దీని నివారణకు గాను తోటల్లో లీటరు నీటికి 2 మిల్లీ లీటర్ల మలథియాన్, 2 మిల్లీలీటర్ల మిథైల్ యుజీనాల్ కలిపి ఎర ద్రావణం తయారు చేయాలి. తర్వాత ఒక్కొక్క ప్లాస్టిక్ పళ్లెంలో 250 మిల్లీలీటర్లు ద్రావణాన్ని పోసి ఎకరాకు నాలుగు చోట్ల ఉంచాలి. ప్యాకింగ్ చేసిన మామిడి కాయలను దూర ప్రాంత రవాణాకు కోసిన 6–8 గంటలలో శీతల గిడ్డంగులలో నిల్వ ఉంచాలి. అందులో 12.5 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత, 80–90 శాతం తేమ ఉండేలా చూసుకోవాలి. లేత తోటలలో మొక్కలకు నీరు పెట్టడం ద్వారా ఎండ వేడిమి నుంచి కాపాడుకోవచ్చు.

అరటి

అరటిలో వైరస్ తెగుళ్ల వ్యాప్తి చేసే రసం పీల్చే పురుగుల నివారణకు ఒక లీటరు నీటికి 1.5 గ్రాముల ఎసిఫేట్ కలిపి పిచికారీ చేయాలి. త్వరగా పెరిగే మొక్కలను తోట చుట్టూ 3–4 వరుసలు నాటుకుంటే వేడి గాలులను అడ్డుకుంటాయి. గెలల సగం పూర్తి అయ్యాక కార్శి పంట కోసం ఒక సూది పిలకను వదిలి మిగిలిన పిలకలను కోసి వేయాలి. వేసవిలో గెలల రక్షణకు గెలలకు ఎండు ఆకులను చుట్టి ఎండ నుంచి రక్షించాలి. లేత గెలల తోటలో వడగాల్పులకు ఆకులు పూర్తిగా మాడి పోయి ఎండిపోతాయి. అరటి గెలలు సరిగా తయారుగాక ఎండ వేడిమికి మాడిపోతాయి. ఇటువంటి తోటలకు నీటి తడులు దగ్గర దగ్గరగా ఇవ్వాలి.లీటరు నీటికి 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా సల్ఫేట్ ఆఫ్ పొటాష్‌లను మార్చి, మార్చి జిగురుతో కలిపి వారం రోజుల వ్యవధిలో నాలుగుసార్లు ఆకులు, గెలలు పూర్తిగా తడిచేలా పిచికారీ చేసి నష్టాన్ని కొంతవరకు నివారించవచ్చు.

బత్తాయి, నిమ్మ

ఈ తోటలలో చెట్లపై మంగు నివారణకు లీటరు నీటికి 3మిల్లీ లీటర్ల డైకోఫాల్ కలిపి పిచికారీ చేయాలి. అధిక వేడి నుంచి చెట్లను కాపాడుకోవటానికి చెట్ల పాదల్లో ఎండు ఆకులు, వరి పొట్టు పోసుకోవాలి.లీటరు నీటికి 20 గ్రాముల సున్నం కలిపిన ద్రావణాన్ని పల్చటి తెల్లటి పొర ఏర్పడే విధంగా చెట్లపైనా, కాయలపైనా పిచికారీ చేయాలి. ఈ ద్రావణంతో పాటు జిగురు కొద్దిగా కలుపుకుంటే సున్నం ఆకులను, కాయలకు బాగా అతుక్కుని ఎక్కువ కాలం ఉంటుంది.

జామ

జామలో బెరడు తొలిచే పురుగు నివారణకు కాండం రంధ్రాలలో 5 మిల్లీ లీటర్ల డైక్లోరోఫాస్ లేదా కిరోసిన్ పోసి బంక మట్టితో పూడ్చాలి.

సపోటా

లేత సపోటా తోటలకు తప్పనిసరిగా నీరు పెట్టాలి. ముదురు తోటలకు అవసరాన్ని బట్టి నీటి తడులు ఇవ్వాలి.



సపోటా

క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జలాల్‌పురం గౌడ సంఘం నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాలకూర్ల జంగయ్యగౌడ్, ప్రధానకార్యదర్శిగా కొయ్యడ శ్రీనివాస్‌గౌడ్, సహాయకార్యదర్శిగా బైరు శంకరయ్య, కోశాధికారిగా బైరు పాండు, డైరెక్టర్లుగా కొయ్యడ నర్సింహ, కప్పల అంజయ్య, బూర్గు యాదయ్య, పాలకూర్ల స్వామి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బైరు బాల్‌రాజ్‌గౌడ్, రైతు సమన్వయ సమితి కన్వీనర్ లక్ష్మయ్య, రాజయ్య, శ్రీనివాస్, వెంకటేశ్, ఉపేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ..

వలిగొండ : మండలంలోని పులిగిల్లలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ గ్రామ శాఖను ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా బుగ్గ వెంకటేశం, ఉపాధ్యక్షుడిగా వాకిటి సంజీవ రెడ్డి, మంద రాజు, ప్రధాన కార్యదర్శి బుగ్గ నర్సింహ, కార్యదర్శిగా బోగ రమేష్, ప్రచార కార్యదర్శిగా బుగ్గ బీరప్ప, సహాయ కార్యదర్శులుగా పల్లెర్ల మహేష్, సనపర్తి భాస్కర్, పర్వతం రాజు,రాచమల్ల లక్ష్మీనర్సు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్, మండల అధ్యక్షుడు పాశం సత్తి రెడ్డి, శ్రీనివాస్, కిష్టయ్య, పలుసం సతీష్, గరిషె రవి, బద్దం సంజీవ రెడ్డి, కాసుల వెంకన్న, పల్లెర్ల సుధాకర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్ష

యాదగిరిగుట్టరూరల్ : మండలంలోని లప్పానాయక్ తండా వాసులు చేపట్టిన నిరసన దీక్ష బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా తమకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ప్యాకేజీ డబ్బులు, భూమికి సంబంధించిన పరిహారం, దాతర్‌పల్లిలో పునరావాసం, ఒకేసారి కావాలని డిమాండ్ చేశా రు. కార్యక్రమంలో సర్పంచ్ ధీరావత్ బుజ్జీ శంకర్, ఉపసర్పంచ్ మంక్యానాయక్ పాల్గొన్నారు.

ప్రజలను సంఘటితం చేసేందుకే 'ఇంటింటికీ సీపీఐ'

ఆలేరురూరల్: బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు తెలిపారు. ఆలేరు పట్టణ కేంద్రంలోని స్థానిక టీఎన్‌జీఓ భవన్‌లో బుధవారం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన మండల కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు రాజ య్య, చెక్క వెంకటేష్, హరిచంద్ర, రాజమణి, కనకయ్య, ఆంజనేయులు, వెంకటేష్, లింగం పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి

ఆత్మకూరు(ఎం): పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశ పెట్టాలని బీఆర్‌ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు సోలిపురం అరుణ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశ పెట్టాలని కోరుతూ బుధవారం ప్రధాని నరేంద్రమోదీ పోస్ట్ కార్డులను పంపించారు. కార్యక్రమంలో సంగీత, రజిత, మానస, సుమతి, అనిత, పద్మ, నీలమ్మ, అంజమ్మ, చంద్రకళ, లక్ష్మ, సుకన్య పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

యాదగిరిగుట్ట రూరల్: దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యాదగిరిగుట్ట ఎస్‌ఐ శేఖర్ అన్నారు. మండలంలోని మల్లాపురం, జంగంపల్లి, లప్పానాయక్ తండా గ్రామాల్లో బుధవారం దొంగతనాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ గురుకుల విద్యాలయంలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహ న కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యాలయం ప్రత్యేకధికారి శివరంజని, షీ టీమ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్యాడ్లు, పెన్నులు పంపిణీ

మోత్కూరు : మండలంలోని పొడిచేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆరాధ్య ఫౌండేషన్ గ్రామ శాఖ అధ్యక్షుడు నర్రె సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరాధ్య ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ లెంకలపల్లి భిక్షం, ఫౌండేషన్ సభ్యులు బీసు అనిల్, కాసర్ల సైదులు, ఒర్సు రాజు, జిట్ట సైదులు, సిరిగిరి ప్రవీణ్, ప్రధానోపాధ్యాయులు ప్రతిమ, లింగస్వామి, ఉమాదేవి, కళ్యాణి, వాణి పాల్గొన్నారు.

రాజాపేట : మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు బుధవారం శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ మాడిశెట్టి సత్యనారాయణ, సభ్యులు బెజుగం రాజేశ్వర్ గుప్త, బాలకిషన్, ప్రధానోపాధ్యాయులు బూర్గు మహేందర్ రెడ్డి, మల్లెమాల తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌తో ఆరోగ్య భరోసా

చౌటుప్పల్ : ప్రజలు ఆయుష్మాన్ భారత్ పథకంతో ఆరోగ్యానికి భరోసా కలుగుతుందని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోలోజు శ్రీధర్ బాబు అన్నారు. పట్టణ కేంద్రంలోని స్థానిక 11 వార్డులో బుధవారం ఆయుష్మాన్ భారత్ పథకం ఈ-కేవైసీని ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రజలతో కలిసి ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గోశిక భిక్షపతి, పురుషోత్తం, ధనుంజయ, కృష్ణ, రఘునాథ్, నారాయణ,భాస్కర్, భావనాఋషి పాల్గొన్నారు.

నెరవేరనున్న కల

- 2009లో కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన
- నిధులు సరిపడక నిలిచిన ఫంక్షన్ హాల్ నిర్మాణం
- ఇటీవల రూ.10లక్షలు మంజూరు కావడంతో మొదలైన పనులు
- త్వరలో అందుబాటులోకి..

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో అన్నివర్గాల ప్రజల అవసరాల కోసం 2009 సంవత్సరంలో కల్యా ణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కానీ అనివార్య కారణాలతో కల్యాణ మండపం పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. అసంపూర్తిగా ఉన్న కల్యాణ మండపం పూర్తి చేసేందుకు ఇటీవల నిధులు మంజూరయ్యాయి. దీంతో వారం రోజులుగా కల్యాణ మండపం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.


నిర్మాణంలో ఉన్న ఫంక్షన్ హాల్

అర ఎకరం స్థలంలో..

మండల కేంద్రంలో 2009లో ఫంక్షన్ హాల్ నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ. 13లక్షలు మంజూరు చేసింది. దీంతో గ్రామ పంచాయతీ వెనుక అర ఎకరం స్థలంలో నిర్మాణ పనులకు అప్పటి ఎమ్మెల్యే వి. పురుషోత్తమరెడ్డి శంకుస్థాపన చేశారు. ఆ నిధులతో వరుడి గది, వరుడు గది ప్లాట్ ఫాం వరకు నిర్మాణం చేశారు. అనివార్య కారణాలతో ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు ఆగిపోయాయి. గతంలో భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ రూ. 5లక్షలు మంజూరు చేశారు. దీంతో ఫంక్షన్ హాల్‌లో కొన్ని పనులను చేపట్టారు. అయినప్పటికి ఫంక్షన్ హాల్ నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. ఇటీవల భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ. 5లక్షలు, పంచాయతీ నిధులు నుంచి రూ. 5లక్షలు మంజూరు చేశారు. దీంతో గత వారం రోజుల నుంచి ఫంక్షన్ హాల్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

అందుబాటులోకి తీసుకురావాలి



మండల కేంద్రంలో ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఫంక్షన్ హాల్ అందుబాటులోకి వస్తే ప్రజలకు ఇబ్బందులు తొలగతాయి. త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నాం.

–యాస కవితాఇంద్రారెడ్డి. ఎంపీటీసీ, ఆత్మకూరు(ఎం)

పనులు ముమ్మరంగా సాగుతున్నాయి



మండల కేంద్రంలో 2009లో నిర్మించ తలపెట్టిన కల్యాణమండపం అనివార్య కారాణాలతో ఆగిపోయింది. అసంపూర్తిగా నిలిచిపోయిన కల్యాణ మండపం నిర్మాణ పనులకు ఇటీవల నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం కల్యాణ మండప నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

–జన్నాయికోడె నగేష్, సర్పంచ్,ఆత్మకూరు(ఎం)

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

రామన్నపేట : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. బుధవారం వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మాజీసర్పంచ్ కూరెళ్ల నర్సింహాచారి-పావని తన తల్లితండ్రులు కూరెళ్ల అంజయ్య-కమలమ్మల జ్ఞాపకార్థం నిర్మించిన సభావేదికను ప్రారంభించారు. వెల్లంకి పాఠశాల అభివృద్ధికి నర్సింహాచారితో పాటు పలువురు దాతలు అందిస్తున్న సహకారం ఆదర్శనీయమన్నారు. అనంతరం సమిష్టి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాశరథి పురస్కారగ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, ఎంపీపీ కన్నెబోయిన జ్యోతీబలరాం, జెడ్పీటీసీ పున్న జగన్మోహన్, సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు ఎర్రోళ్ల లక్ష్మమ్మ, తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ రవ్వ అనసూయ, ప్రధానోపాధ్యాయుడు ఏనుగు సత్తిరెడ్డి వేదిక నిర్మాణదాతలు మాజీసర్పంచ్ కూరెళ్ల నర్సింహాచారి పావని ఎస్‌ఎంసీ చైర్మన్ రమేష్ పాల్గొన్నారు.


సభావేదిక ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

సీసీరోడ్డు పనులు ప్రారంభం

రామన్నపేట : మండలంలోని నీర్నెముల గ్రామంలోని 1వ వార్డులో రూ. 5లక్షల చేపట్టిన సీసీరోడ్డు పనులను బుధవారం స్థానిక సర్పంచ్ ముత్యాల సుజాతరవి ప్రారంభించారు. కార్యక్రమంలో చలమల్ల గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి ఉపేందర్, శ్రీధర్, మల్లయ్య, కోటమ్మ, వెంకటేష్, యాదయ్య, సైదులు, జనార్దన్, యాదమ్మ పాల్గొన్నారు.

బొమ్మలరామారం : మండలంలోని చీకటిమామిడి గ్రామంలో రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మచ్చ వసంతా శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ బాల్ నర్సింహ, శ్రీనివాస్‌గౌడ్, చంద్రమౌళి, బల్‌రామ్, మహేష్, హలీమా జహంగీర్,జమాల్, భరత్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే పీఏసీఎస్ ధ్యేయం


యాదగిరిగుట్ట రూరల్ : మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి


సంస్థాన్ నారాయణపురం : మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ జక్కడి జంగారెడ్డి

యాదగిరిగుట్ట రూరల్: రైతు సంక్షేమమే పీఏసీఎస్ ధ్యేయమని పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి అన్నారు. బుధవారం కార్యాలయం ఆవరణలో రైతులతో కలిసి జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నామన్నారు. మండలంలోని కాచారం గ్రామంలో గ్రిడ్ యాంగిల్ ఏర్పాటుకు నాబార్డు నుంచి నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పెలిమెల్లి శ్రీధర్ గౌడ్, దాతర్‌పల్లి సర్పంచ్ బైరగాని పుల్లయ్య, సీఈఓ ఆంజనేయులు, అశోక్ రెడ్డి, మల్లారెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: రైతు సంక్షేమానికి పీఏసీఎస్ కృషి చేస్తుందని పీఏసీఎస్ చైర్మన్ జక్కడి జంగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో డైరక్టర్‌లు బోడ్డుపల్లి గాలయ్య, గడ్డం పెంటయ్య, ముత్యాల అంజయ్య, జంగయ్య, సీఈఓ శేఖర్, శంకర్, వెంకటేష్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బీబీనగర్: మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్వస్తివాచనం, అంకురార్పణం, గణపతి పూజలు నిర్వహించి స్వామివారి ఎదుర్కోళ్ల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రణీతాపింగళ్‌రెడ్డి, సర్పంచ్ మల్లగారి భాగ్యలక్ష్మిశ్రీనివాస్ పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలోని శ్రీరామాలింగేశ్వర స్వామి వార్షిక ఉత్సవాఉలు బుధవారం ప్రారంభమయ్యాయి కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి వేడుకలు

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో బుధవారం శ్రీరామ నవమి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలోమున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, దేవాలయ మాజీ అధ్యక్షుడు దేవరపల్లి గోవర్దన్‌రెడ్డి, మాజీ ధర్మకర్తలు ఎంఎస్.గౌడ్, ఉప్పల కుసుమ, గంగరాములు, శేఖర్, కౌన్సిలర్లు పోలోజు శ్రీధర్‌బాబు, నాగరాజు, లింగస్వామి, అరుణబాలకృష్ణ, శైలజభాస్కర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

వలిగొండ : పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని మహిళా శిశు సంక్షేమ అధికారిని వాణిశ్రీ అన్నారు. బుధవారం మండలంలోని వెలవర్తి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు క్రమం తప్పక ఐరన్ మాత్రలు వేసుకోవాలన్నారు. అనంతరం అంగన్వాడీ టీచర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

ఆత్మకూరు(ఎం): ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీటీసీ యాస కవిత అన్నారు. బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ పక్షోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ జ్యోతి, ఏఎన్‌ఎం మమత, బీఆర్‌ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షుడు సోలిపురం అరుణ పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో అధిక పోషకాలు

రామన్నపేట : చిరు ధాన్యాల్లో అధిక పోషకాలు ఉంటాయని ఐసీడీఎస్ సీడీపీఓ శాగంటి శైలజ, సర్పంచ్ అంతటి పద్మా రమేష్ అన్నారు. బుధవారం బోగారం గ్రామంలో ఏర్పాటు చేసిన పోషణ పక్షోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు విధిగా పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గాదె జలేందర్‌రెడ్డి, ఎంపీటీసీ గోగు పద్మసత్తయ్య, ఏసీడీపీఓ సమీరామీర్జా, సూపర్‌వైజర్ హేమలత, మండల వైద్యాధికారి డాక్టర్ అశ్వినికుమార్, వినోద, శోభ, వసంత, పారిజాత, సంధ్య పాల్గొన్నారు.


గుండాల : చిరు ధాన్యాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ తాండ్ర అమరావతి

గుండాల : చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎంపీపీ తాండ్ర అమరావతి అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండేందుకు చిరు ధాన్యాలు, కూరగాయలు, పప్పు దినుసులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.శ్రీనివాసులు, సీడీపీఓ జ్యోత్స్న, ఎంపీఓ జనార్ధన్‌రెడ్డి, ఏపీఎం అంజయ్య, ప్రజా ప్రతినిధులు వరలక్ష్మి, దార సైదులు, భిక్షమమ్మ, బాలకృష్ణ, షమీమ్, యాకుపాషాభేగం తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దుచేయడం తగదు


నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

భువనగిరిటౌన్ : రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడం అప్రజాస్వామికమని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం రాష్ట్ర కో ఆర్డినేటర్ బెండ శ్రీకాంత్ అన్నారు. బుధవారం రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమార్, కిషోర్, సాల్వే ఉపేందర్, తరుణ్, మిట్టల్ వెంకటేష్, సాయికుమార్, రాజు, ప్రకాశ్, మహేందర్ ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

భూదాన్‌పోచంపల్లి : ప్రతిఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి అన్నారు. బుధవారం గాంధీ విగ్రహం నుంచి చౌటుప్పల్ చౌరస్తా వరకు స్వచ్ఛ ఉత్సవ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణాన్ని పచ్చదనం, పరిశుభ్రంగా ఉంచుతామని సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు, మేనేజర్ శ్రీనివాసస్వామి, మెప్మా అధికారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు: మోత్కూరు మున్సిపల్ పరిధిలోని స్వచ్ఛత కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రిమేఘారెడ్డి అన్నారు. బుధవారం స్వచ్ఛ మాశల్ మార్చ్‌ను నిర్వహించారు. ఈకార్యక్రమంలో కమిషనర్ సి.శ్రీకాంత్, వైస్ చైర్మన్ బి.వెంకటయ్య, వార్డు కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మహిళలు, అధికారులు

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

వలిగొండ : రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం అని బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంతో పాటు మండలంలోని సంగం గ్రామంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం లో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, కొలుపుల అమరేందర్, రాజవర్దన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పనుమాటి మమత నరేందర్ రెడ్డి,సురకంటి వెంకట్ రెడ్డి, మొగుళ్ల శ్రీనివాస్, రత్నయ్య, రవి, కృష్ణ, కీసర రాం రెడ్డి, రమేష్, లింగస్వామి పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవ రెడ్డి

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలి

బొమ్మలరామారం : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ సమష్టిగా కృషి చేసి ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలని ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ ఫేస్ 2 అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. అనంతరం మండలంలోని జలాల్‌పూర్‌లో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంగిశెట్టి వెంకటేష్ ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరిత, బాల శంకర్, ఎంపీఓ మాజీద్,ఈసీ రాజశేఖర్, సర్పంచ్ సంగిశెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం


మోత్కూరు : చలివేంద్రం ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సావిత్రి

భూదాన్‌పోచంపల్లి : చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్ అన్నారు. పట్టణ కేంద్రంలో బోధిధర్మ యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బాత్క లింగస్వామి, అసోషియేషన్ అధ్యక్షుడు సీత భాస్కర్, యోగ శిక్షకురాలు కొయ్యడ సంధ్యారాణి, నల్ల నాగేశ్, చింతకింది కిరణ్, కేమ విష్ణుమూర్తి, కె. మల్లేశ్, చింతల రామకృష్ణ, ఈపూరి ముత్యాలు, నర్సింహ, పరమేశ్, చక్రపాణి, లింగస్వామి, సైకిలాబ్, రత్నం, విడెం విష్ణు, రమేశ్ పాల్గొన్నారు.

మోత్కూరు : చలి వేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రిమేఘారెడ్డి అన్నారు. మోత్కూరు కొత్త బస్టాండ్ ఆవరణలో ఎవరెస్ట్ యువత సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బి.వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్, కౌన్సిలర్లు గుర్రం కవిత, బి.కళ్యాణ్‌చక్రవర్తి, కోఆప్షన్ మెంబర్ ఆనందమ్మ, మాజీ ఎంపీటీసీ జంగ శ్రీను, ఎవరెస్ట్ యూత్ సమితి జిల్లా అధ్యక్షులు బాలెంల మధు, మండల శాఖ అధ్యక్షులు కొమురయ్య, శ్రీనివాస్ గౌడ్, నర్సింహ, మచ్చగిరి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలి


రాజాపేటలో వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


భువనగిరి : వీడ్కోలు సమావేశంలో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

మోత్కూరు : విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని ప్రముఖ గేయ రచయిత, సాంస్కృతిక మండలి సభ్యుడు కోదారి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని పాటిమట్ల ఉన్నత పాఠశాలలో జరిగిన పదవ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులలోనే సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం లభిస్తుందన్నారు. అనంతరం గ్రామానికి చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి మెతుకు అంజయ్య తన భార్య మెతుకు బాలమణి జ్ఞాపకార్థం విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అగ్గిరాములు, ఉపాధ్యాయులు లింగమల్లు, స్వప్న, నాగలక్ష్మి, వీరాచారి, కృష్ణ, నరేష్, ఉప్పలయ్య, రామానుజమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి : పట్టణంలోని శ్రీ నవభారత్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు బుధవారం ఫ్రెషర్స్, ఫెరవెల్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంజీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ మధులేలి, కళాశాల చైర్మన్ సుకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోటకొండూర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రఘురాంరెడ్డి, దానయ్య, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణయ్య, సత్యనారాయణ, వినోద్‌గౌడ్, శ్రీను, విశ్వరూపం తదితరులు ఉన్నారు.

గుండాల: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గిరివర్ధన్, ఉపాధ్యాయులు మెర్సిగ్రేసి రామకృష్ణ, హరిత, స్వప్న, జగన్, రవి, మహేష్, శ్రీనివాస్, సర్వమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజాపేట : విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రధానోపాధ్యాయుడు బూర్గు మహేందర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లెమాల అన్నారు. బుధవారం మండలంలోని నెమిల, రాజాపేట బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. రాజాపేట బాలుర ఉన్నత పాఠశాలలో 192 రోజుల పాటు పాఠశాలకు హాజరైన ఇద్దరు విద్యార్థులకు ఉపాధ్యాయుడు భాషెట్టి విష్ణు భగవద్గీతలను బహూకరించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు(ఎం): కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ దుంప వెంకటేష్ అన్నారు. బుధవారం మండలంలోని రహీంఖాన్‌పేటలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. సందర్భంగా ఎంపీటీసీ దుంప వెంకటేష్-సుజాత దంపతులు కప్రాయపల్లి సబ్ సెంటర్‌కు బీపీ మీటర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి విలియం కేరి, ఉప సర్పంచ్ ఎరమేష్, ధనలక్ష్మి, సత్యానందం పాల్గొన్నారు.

మోత్కూరు : ప్రతిఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రిమేఘారెడ్డి అన్నారు. బుధవారం 12వ వార్డు పరిధిలోని గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీకాంత్, హేమంత్‌కుమార్, డాక్టర్ నిరోష, కౌన్సిలర్ కుమారస్వామి పాల్గొన్నారు.

మోటకొండూర్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం సర్పంచ్ సర్పంచ్ వడ్డెబోయిన శ్రీలత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్, అంజిరెడ్డి, బురాన్, వరమ్మ, సరమ్మ, సత్తమ్మ పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని పుట్టపాక గ్రామంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని బుధవారం సర్పంచ్ సామల భాస్కర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వసంత, ఉపసర్పంచ్ చంద్రశేఖర్, సత్యం పాల్గొన్నారు.

బీబీనగర్: మండలంలోని రాఘవాపురంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అండాలుఅశోక్, సర్పంచ్ స్వప్నకృష్ణ, ఉప సర్పంచ్ మంగమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు చేనేత సంఘం మహాసభ

చౌటుప్పల్ : చౌటుప్పల్ చేనేత సహకార సంఘం 47వ వార్షిక, 59వ సాధారణ మహాసభను గురువారం నిర్వహించనున్నట్లు చేనేత సంఘం పర్సన్ ఇంచార్జ్ కందగట్ల భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ కేంద్రంలోని బీఈడీ కళాశాల వద్ద ఉన్న పద్మశ్రీ ఫంక్షన్‌హాల్‌లో మహాసభ నిర్వహిస్తున్నామన్నారు.

ఉచిత పశు వైద్యశిబిరం

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధి తంగడపల్లి గ్రామంలో బుధవారం దివీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్, దివీస్ ప్రతినిధులు జి.వెంకటేశ్వర్లు, ఎస్.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

భూదాన్‌పోచంపల్లి/ భువనగిరి : మండలంలోని దేశ్‌ముఖిలోని విజ్ఞాన్ ఇనిస్టూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతూ ఫీజు చెల్లించడానికి ఆర్థిక ఇబ్బంది పడుతున్న పేద విద్యార్థి కంపెల్లి తేజస్వరూప్‌కు బుధవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి తన ఫౌండేషన్ ద్వారా రూ. 25వేల ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్తులో ఉన్నత చదువులకు అవసరమైన ఆర్థిక తోడ్పాటునందిస్తానని భరోసా ఇచ్చారు.

ఆలయ హుండీ లెక్కింపు

భువనగిరి : మండలంలోని అనంతారం గ్రామ పరిధిలో గల శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం హుండీని బుధవారం లెక్కించారు. మొత్తం రూ. 2,10,252లు ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ నరేందర్‌రెడ్డి తెలిపారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలోని అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ గ్రామానికి చెందిన పలువురు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో బి.సతీష్‌గౌడ్, ఎర్ర ఊషయ్య, వెంకటేష్, సతీష్, నవీన్‌కుమార్ ఉన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేత

భువనగిరి : మండలంలోని తుక్కాపురం గ్రామానికి చెందిన నల్లమాస కిష్టయ్య రూ. లక్ష, రత్నపురం రమేష్‌కు రూ. 60 వేల చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనగాం పాండు, మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ పద్మ, ఎంపీటీసీ మల్లేష్, మాజీ సర్పంచ్ పుట్ట వీరేష్, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, నాయకులు రాసాల శేఖర్ యాదవ్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రుద్రగాయత్రి హవనం

యాదగిరిగుట్ట రూరల్: పట్టణంలో అఖండ నామ ఆశ్రమ పీఠాధిపతి ప్రసన్న కృష్ణదాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అక్షయ సువర్ణ లక్ష్మీనారాయణ మహాయజ్ఞం బుధవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రుద్రగాయత్రి హవనాన్ని స్వామిజీలు వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

వలిగొండ : ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ప్రగతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమణ అన్నారు. బుధవారం ప్రగతి డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1 ఆధ్వర్యంలోమండలంలోని కెర్చిపెల్లిలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీఓ ధనుంజయ్య,ఉపాధ్యాయులు శ్రీశైలం, వెంకటేశం, ప్రణయ కుమార్, గోపి, దయాకర్ రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మోత్కూరు : ఈ నెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరుగనున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి వేపూరి శ్రీధర్ బుధవారం తెలిపారు. మండలంలో 500 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్థానిక సేక్రెడ్ హార్ట్ హైస్కూల్, దాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలకు సంబంధించి ఫర్నీచర్, లైటింగ్, ఫ్యాన్స్, సీసీ కెమెరాల సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలి

ఆలేరురూరల్ : అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయించాలని పలువురు నాయకులు అన్నారు. బుధవారం ఆలేరు పట్టణం కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ను బుల్ బెడ్రూం ఇళ్లను అనర్హులకే కేటాయించారని ఆరోపిస్తూ నిరసన తెలిపారు. ఎమ్మెల్యే మరోసారి విచారణ చేసి న్యాయం చేయాలన్నారు. అనంతరం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే గొంగిడి సునీతల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గౌరవపు అరుణ, కుడికాల నాగలక్ష్మి, ఎండి సర్వర్, మంజుల, సల్మాబేగం, సఫియాబేగం, సోమలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రచార రథం ప్రారంభం

భువనగిరి : వచ్చే నెల 6న నిర్వహించనున్న వీర హనుమాన్ విజయయాత్ర బైక్ ర్యాలీ ప్రచార రథాన్ని బుధవారం విశ్వహిందూ పరిషత్ జిల్లా కోశాధికారి చామ రవీందర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున్, కార్యదర్శి సాల్వేరు వేణు, బజరంగ్‌దళ్ జిల్లా కో కన్వీనర్ మేకల భాను, గాయపాక పృథ్వీరాజ్, వినయ్, శ్రీనివాస్, నవీన్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.